పాతబస్తీ ముస్తాబు

- 13న చార్మినార్, లాడ్‌బజార్‌లలో హెరిటేజ్ వాక్
- సర్వాంగ సుందరంగా పాతబస్తీ వీధులు
- రంగు రంగుల విద్యుత్ దీపాలతో జిగేల్


చార్మినార్ వద్ద సెల్ఫీ కోసం ఏర్పాటు చేసిన మిస్ వరల్డ్-2025 విద్యుత్ కటౌట్


విద్యుత్ దీపాలంకరణలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఫ్లైఓవర్


మదీనా నుంచి చార్మినార్ వరకు విద్యుత్ దీపాలంకరణ

చార్మినార్: ఈ నెల 13న సాయంత్రం చార్మినార్, లాడ్‌బజార్‌లలో మిస్ వరల్డ్ పోటీ దారులతో హెరిటేజ్ వాక్ జరగనున్న నేపథ్యంలో చార్మినార్ కట్టడాన్ని మువ్వన్నెల జెండాలతో తీర్చిదిద్దారు. జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ ఎలక్ట్రికల్ విభాగం ఆధ్వర్యంలో చార్మినార్ కట్టడం, డాక్టర్ మన్మోహన్ సింగ్ ఫ్లైఓవర్, చార్‌కమాన్‌తో పాటు మదీనా నుంచి గుల్జార్ హౌజ్ వరకు రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. పాతబస్తీ వైవిధ్యాన్ని చారిత్రక ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేసేలా జరగనున్న ఈ హెరిటేజ్ వాక్‌కు ఇప్పటికే తగిన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు జీహెచ్ఎంసీ అధికారులు. లాడ్‌బజార్‌లో మిస్ వరల్డ్ ప్రతినిధులు స్థానిక కళాకారులతో మాట్లాడనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు ఈ ఈవెంట్‌ను తిలకించనున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని జీహెచ్ఎంసీ, విద్యుత్, పర్యాటక, పోలీసు, ఆర్కియాలజీ తదితర విభాగాలకు చెందిన అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున విదేశీ పర్యాటకులను తెలంగాణకు ఆకర్షించేలా ప్రణాళిలు సిద్ధం చేశారు. జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం ఆధ్వర్యంలో మిస్ వరల్డ్-2025 అనే విద్యుత్ కట్ అవుట్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికే పర్యాటకులు ఈ కటౌట్ వద్ద సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు.

వీధులన్నింటినీ విద్యుదీపాలతో అలంకరించాం..



మిస్ వరల్డ్ పోటీదారులు పాతబస్తీకి రానున్న సందర్భంగా వీధులన్నింటినీ విద్యుదీపాలతో అలంకరించాం. జూపార్క్-ఆరాంఘర్ (డాక్టర్ మన్మోహన్ సింగ్ ఫ్లై ఓవర్) ద్వారా పాతబస్తీకి రానున్న సందర్భంగా ఆయా రోడ్లన్నింటితో పాటు చార్మినార్, లాడ్‌బజార్‌లను రూ.20 లక్షలతో విద్యుత్ దీపాలంకరణ చేశాం.
– సత్యనారాయణ రెడ్డి, డీఈఈ, జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్

నారదుడే తొలితరం పాత్రికేయుడు


పాత్రికేయుడిని సన్మానిస్తున్న సమాచార భారతి ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: నారదుడే తొలితరం పాత్రికేయుడని వక్తలు అన్నారు. శనివారం కోఠిలోని వైఎంఐఎస్ ఆడిటోరియంలో దేవర్షి నారద జయంతి కార్యక్రమానికి సమాచార భారతి అధ్యక్షుడు ఆచార్య గోపాల్ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా రిటైర్డ్ ఐఏఎస్ సీహెచ్ వి.సాయిప్రసాద్ హాజరై సీనియర్ పాత్రికేయులు కొరిడె మహేష్, గాండ్ల సంపత్, భాస్కర్ యోగి, డాక్టర్ కె.అనిత, రాఘవేంద్రను సత్కరించారు. అనంతరం సాయిప్రసాద్ మాట్లాడుతూ..నారదుడు త్రిలోక సంచారకుడిగా ఉంటూ కొన్ని విషయాలను సత్య నిష్టతో హితంగా చెబుతూ అన్నివర్గాల వారికి సమాచారాన్ని చేరవేశారన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విద్యాభారతి, రక్షణ భారత క్షేత్ర అధ్యక్షుడు డాక్టర్ చామర్తి ఉమా మహేశ్వర్‌రావు, ఆర్ఎస్ఎస్ రక్షణ మధ్య క్షేత్రం ప్రచార ప్రముఖ్ నడింపల్లి ఆయూష్, తెలంగాణ ప్రచార ప్రముఖ్, కట్ట రాజ్‌గోపాల్‌తో పాటు పాత్రికేయులు పాల్గొన్నారు.

‘భారత్‌కు తిరుగులేదు’


జాతీయ జెండాలతో విజయ సంబరాల్లో మహ్మద్ నజీబ్ తదితరులు

గోల్కొండ: భారత్‌కు తిరుగులేదు అన్న విషయం మరోసారి నిరూపితమైందని పీస్ ఫోర్స్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ నజీబ్ అన్నారు. భారత్, పాక్‌ల మధ్య యుద్ధం పరస్పర అంగీకారంతో ఆగిపోవడంపై పీస్ ఫోర్స్ సొసైటీ ఆధ్వర్యంలో టోలిచౌకీ వద్ద సంబరాలు నిర్వహించారు. భారత్ శక్తిసామర్థ్యాల ముందు తమ ఆటలు సాగవన్న విషయం పాక్ గుర్తించిందని అందువల్లే యుద్ధ విరమణకు బేరం చేసిందన్నారు. అబద్ధపు ప్రచారంతో పాకిస్తాన్ ప్రపంచ దేశాలకు తప్పుడు సందేశాలు ఇచ్చిందన్నారు. అయితే ఉగ్రవాద నిర్మూలనపై భారత్ అనుసరిస్తున్న వైఖరి అగ్రదేశాలు గుర్తించి భారత్‌కు వత్తాసు పలికాయన్నారు. ఈ సందర్భంగా పీస్ పోర్స్ సొసైటీ సభ్యులు జయహో భారత్ అంటూ నినాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమీర్, మహ్మద్ ఫహద్, నయీం, అమ్జద్, గఫార్ తదితరులున్నారు.

సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు


టీఎఫ్‌సీఓ సభ్యత్వ బుక్‌లెట్‌ను అందిస్తున్న మహ్మద్ నజీబ్

గోల్కొండ: తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు మంచి గుర్తింపు లభిస్తుందని ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. శనివారం టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని టీఎఫ్‌సీఓ కార్యాలయంలో ఆయన పలువురికి మెంబర్‌షిప్ బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తాము నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు ఉమ్మడి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఆయిషా బేగం మార్గదర్శకురాలిగా ఉంటున్నారన్నారు. ఆమె సూచనల మేరకే తాము ఫ్యామిలీ కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్రాన్సిలింగ్, ఇనాయత్ తదితరులున్నారు.

ఆర్థిక సాయం

యాకుత్‌పురా: తలాబ్ చంచలం డివిజన్ అమన్‌నగర్-బీలోని ఓ ఇంట్లో ప్రమాదవశాత్తు ఏసీ కంప్రెషర్ పేలిన ఘటనలో తీవ్ర గాయాలపాలైన బాధిత కుటుంబసభ్యులను శనివారం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ కార్పొరేటర్ సమీనా బేగంతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అమన్‌నగర్‌లోని హుజైర్ ఖాన్ ఇంట్లో ఏసీని రిపేర్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కంప్రెషర్ పేలడంతో ఖాన్‌తో పాటు మరో యువకుడు అలీ తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందిచామన్నారు.


బాధిత కుంటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

షేక్‌పేట్ అభివృద్ధికి ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ కృషి


షేక్‌పేట్ లక్ష్మీనృసింహ స్వామి ఆలయం వద్ద కాంగ్రెస్ నాయకులు

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్ అభివృద్ధికి రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ అన్నారు. షేక్‌పేట్‌లోని లక్ష్మీనృసింహ స్వామి ఆలయ విద్యుత్ లైట్ల అభివృద్ధికి ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ రూ.లక్ష మంజూరు చేశారు. ఈ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలు, బస్తీలలో వీడీ సీసీ రోడ్లు, మోడ్రన్ విద్యుత్ దీపాలు ఎంపీ చొరవతోనే పూర్తయ్యాయన్నారు. అంతేకాకుండా ఓ వైపు బస్తీలను అభివృద్ధి చేస్తూనే కాలనీల్లో సైతం అభివృద్ధి పనులను ఆయన నిధులు కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సి.నర్సింగ్‌రావు, కార్యదర్శి మల్లేష్, ప్రధాన కార్యదర్శులు హరి, రవి తదితరులున్నారు.

చెస్ పోటీలు, ఎగ్జిబిషన్ ప్రారంభం



చార్మినార్: ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరగనున్న చార్మినార్ ఓపెన్ రౌండ్ రాబిన్ చెస్ టోర్నమెంట్-2025 శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. రెండో రోజైన ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి చెస్ పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఉర్దూఘర్‌లో జరిగే ఈ చెస్ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచే విద్యార్థులకు నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికెట్, మెడల్స్ అందజేయనున్నామన్నారు.

నేడు మధ్యాహ్నం 2 గంటల నుంచి..

పురాతన నాణేలు, కరెన్సీ అంతర్జాతీయ ఎగ్జిబిషన్ శనివారం ప్రారంభమైంది. ఇక రెండో రోజైన ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఎగ్జిబిషన్ కొనసాగనుందని నిర్వాహకులు తెలిపారు. వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఈ సడలింపు ఇస్తున్నట్లు వారు తెలిపారు.

13 నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

- 13 నుంచి 19వ తేదీ వరకు ఉత్సవాలు
- అన్ని ఏర్పాట్లు చేసిన ఆలయ నిర్వాహకులు



అబిడ్స్: ఈ నెల 13 నుంచి గుడిమల్కాపూర్ ఝూంసింగ్ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఆలయంలో ఈ నెల 19వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. 13న ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవా వేడుకలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మధ్యాహ్నం 11.30 గంటలకు రాజభోగం, సాయంత్రం 6 గంటల నుంచి ఆరాధన, రక్షాబంధనం, ఊరేగింపు నిర్వహించనున్నారు. 14న ఉదయం 8 గంటలకు మూర్తి కుంబ, హోమ కుంభ, ఆహ్వాన వేడుకలు, సాయంత్రం 6 గంటల నుంచి బేరిపూజ, నిత్యాహోమం తొలకిసేవలు నిర్వహించనున్నారు. 15న బాలభోగం, శేషవాహన సేవలు ఉంటాయన్నారు. 16న నిత్య హోమం, శ్రీవారి మోహిని సేవా బలిహరణం, ఎదుర్కోలు నిర్వహించనున్నారు. 17న శ్రీవారి తిరుకళ్యాణోత్సవాలు జరుపనున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయంత్రం శ్రీవారి దివ్యబ్రహ్మ రథోత్సవం నిర్వహిస్తారు. 18న నిత్య హోమం, నివేదన, మహా పూర్ణాహుతి, రాజభోగం, సాయంత్రం పుష్పయాగం, ధ్వజారోహణ, మూక బలి పూజలు నిర్వహిస్తామన్నారు. 19న నిత్య నిధి, అర్చనలు, అర్జిత సేవలు, రాజభోగం, సాయంత్రం 7 గంటల నుంచి శ్రీవారి శృంగార రథోత్సవం వేడుకలు చేపడుతామన్నారు. ఈ వేడుకలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

చెత్త కుప్పలను తొలగించండి



అబిడ్స్: మంగళ్‌హాట్ శివలాల్‌నగర్‌లో రోడ్లపై చెత్తాచెదారం పెరిగిపోవడంతో స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఈ ప్రాంతంలో చెత్తాచెదారం తొలగించకపోవడంతో రోడ్లపై పేరుకుపోయి దుర్గంధభరిత వాసనలతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. జీహెచ్ఎంసీ సిబ్బంది సకాలంలో చెత్త కుప్పలు తొలగించకపోవడంతో స్థానిక ప్రజలు ఇక్కట్ల పాలవుతున్నారు. జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యంతో చెత్త కుప్పలు పెరిగిపోయి ప్రజలు అనారోగ్య పాలవుతున్నారు. ఇప్పటికైనా చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఎఫ్‌డీడీఐలో వినూత్న కార్యక్రమం

రాయదుర్గం: ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్-హైదరాబాద్‌లో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ‘యంగ్ మైండ్స్ ఎక్స్‌ప్లోర్ డిజైన్ హరిజన్స్ ఎట్ ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్’ పేరిట శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.అందులో భాగంగా ప్రభా ఫౌండేషన్ నుంచి 35 మంది విద్యార్థులు, అయిదు మంది అధ్యాపకులతో కూడిన బృందానికి అతిథ్యం ఇచ్చింది. యువ ఆశావహులలో సహ కారం అభ్యాసాన్ని పెంపొందించడం, డిజైన్‌పై అవగాహనను ప్రోత్సహించడం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎఫ్‌డీడీఐ ప్రతినిధి ఫైజీ మాట్లాడారు. అనంతరం పాదరక్షలు, ఫ్యా షన్, జీవనశైలి, ఉత్పత్తి రూపకల్పన సాధనాలు, సాంకేతికతను వివరించారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

మైలార్‌దేవ్‌పల్లి: సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసేందుకు కార్మికులంతా తరలిరావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో స్థానిక సీఐటీయూ నాయకులు, కార్మికులతో జిల్లా కమిటీ సభ్యులు జాజాల రుద్రకుమార్ అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ్యాప్తంగా అన్ని కేంద్ర కార్మిక సంఘాలు, బ్యాంకు ఫెడరేషన్లు ఏకమై సమ్మెను చేస్తున్నారని అన్నారు. ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు డి.జగదీష్, జిల్లా సహాయ కార్యదర్శులు అల్లి దేవేందర్, వీరయ్య, సునీత, స్వప్న, జిల్లా కమిటీ సభ్యులు ఎల్లయ్య, ఈ.నర్సింహ్మా, టి.నర్సింహ్మా, ఎల్లేష, బుగ్గ రాములు, ప్రవీణ్, పెంటయ్య, ఎల్లయ్య, రాములు, బుట్టి బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ఎంప్లాయీస్ యూనియన్ లక్ష్యం


లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న జీఎం శ్రీనివాస్ నాయక్ తదితరులు

అబిడ్స్: కార్మికుల సంక్షేమమే ఎంప్లాయీస్ యూనియన్ లక్ష్యమని హైదరాబాద్ మెట్రో వాటర్‌బోర్డు ఎంప్లాయీస్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు జి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కార్మిక శ్రమశక్తి అవార్డు రాష్ట్ర ప్రభుత్వంచే పొందిన లక్ష్మీనారాయణను శనివారం వాటర్‌బోర్డు 3వ డివిజన్ కార్యాలయంలో ఘనంగా సత్కారం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ..30 ఏళ్లకు పైగా కార్మికులు, సిబ్బంది, సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న తనకు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కార్మిక శ్రమశక్తి అవార్డు-2025 లభించడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. తన జీవితాంతం కార్మికులు, ఉద్యోగుల ప్రగతి కోసం వారి సంక్షేమం కోసం , అభ్యున్నతి కోసం కృషి చేస్తానన్నారు. వాటర్‌బోర్డులో పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జీఎం శ్రీనివాస్ నాయక్‌తో, సీనియర్ ఆఫీసర్ ప్రభాకర్‌రెడ్డి, మేనేజర్ రమేష్, సత్యనారాయణ, ధన్‌రాజ్, శ్రీధర్ పాల్గొన్నారు.

విజేతలు ఎస్‌సీఆర్, డీబీఏ


మహిళల విభాగంలో విజేత డీబీఏ టీమ్‌కు ట్రోఫీని అందజేస్తున్న శ్రీధర్ రెడ్డి తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: ఎల్వీఆర్ మెమోరియల్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో పురుషుల విభాగంలో దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్), మహిళల విభాగంలో డీబీఏ జట్లు విజేతలుగా నిలిచాయి. ఆర్‌వీబీఆర్ఆర్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఈ పోటీలు జరిగాయి. పురుషుల విభాగం ఫైనల్లో ఎస్‌సీఆర్ 66–49 పాయింట్ల తేడాతో ఎన్‌బీఏ టీమ్‌ను ఓడించింది. ఎస్‌సీఆర్ తరఫున సంతోష్ 17, అజిత్ 15 పాయింట్లు సాధించగా..ఎన్‌బీఏ ఆటగాళ్లలో బాలాజీ 20, కౌశిక్ 9 పాయింట్లు నమోదు చేశారు. మహిళల ఫైనల్లో డీబీఏ 61–42 పాయింట్ల తేడాతో ఎన్‌బీఏ జట్టుపై గెలుపొందింది. డీబీఏ తరఫున నేత్ర 26, మేధ 20 పాయింట్లు స్కోర్ చేయగా..ఎన్‌బీఏ ప్లేయర్లలో అమిత 16, జాహ్నవి 9 పాయింట్లు సాధించారు. తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు మానవీయ విలువలు నేర్పాలి


కార్యక్రమంలో చల్మారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు

అఫ్జల్‌గంజ్: విద్యార్థులకు మానవీయ విలువలు నేర్పాలని స్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ ఎస్.చల్మారెడ్డి, కార్యదర్శి ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి అన్ని రంగాల్లో రాణించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. శనివారం కళాశాల ఆవరణలో నిర్వహించిన ప్రారంభ సార్వత్రిక మానవీయ విలువలు అనే అంశంపై ప్రసంగించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మూడు రోజుల పాటు ఈ మానవీయ విలువలపై, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే పలు మార్గాలను వివరించారు. ప్రిన్సిపాల్ గిరిధర్ ఆకుల మాట్లాడుతూ.. విద్య వ్యవస్థలో మార్పునకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నిధి చిరాగ్, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ ఇష్రత్, మీరా మిర్జాన తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాల ప్రదానం


దేవేందర్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న ఆచార్య వెల్దండ నిత్యానందరావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో యువ సాహిత్య రచయితలు రావాల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఆచార్య వెల్దండ నిత్యానందరావు అన్నారు. శనివారం రవీంద్రభారతిలో పీచర సునీతారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురు రచయితలకు పీచర సునీతారావు చతుర్ధ వార్షిక స్మారక సాహిత్య పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సాహితీ, రచయితలను గుర్తించి వారికి పురస్కారాలను అందజేయడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం పలు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సుంకిరెడ్డి, నారాయణరెడ్డి, సంపాదకులు కె.ఆనందచారి, ఫౌండేషన్ చైర్మన్ విజయేందర్‌రావ్, పురస్కార కమిటీ కన్వీనర్ కె.గోవర్ధన్‌రాజు, సాహితీ వేత్తలు తిరునగరి దేవకి చమన్ సింగ్, బెల్లంకొండ సంపత్ కుమార్, గుడిపాటి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నేడు అంజుమన్-ఇ-ముతవల్లియన్ వార్షిక సాధారణ సమావేశం


మీర్ అబ్బాస్ అలీ మూస్వీ

శాలిబండ: మదీనా చౌరస్తాలోని బాద్‌షాహీ ఆషూర్‌ఖానాలో ఈ నెల 11న సాయంత్రం 4.30 గంటలకు అంజుమన్-ఇ-ముతవల్లియన్ 2025 వార్షిక సాధారణ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు అంజుమన్-ఇ-ముతవల్లియన్ అధ్యక్షుడు మీర్ అబ్బాస్ అలీ మూస్వీ తెలిపారు. తెలంగాణలో 11,000కి పైగా ఆషూర్ ఖానాలకు ప్రాతినిథ్యం వహిస్తున్న అంజుమన్-ఇ-ముతవల్లియన్ సమావేశానికి ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో పవిత్ర మొహర్రం నెల ఉత్సవాలు, పీర్ల పండుగ వంటి తెలంగాణ సంస్కృతి విశేషాలపై అవగాహన పొందేందుకు ఒక అరుదైన అవకాశమని..ఈ సమావేశానికి అందరూ హాజరుకావాలన్నారు.

‘దేశం గర్వించదగ్గ నిర్ణయాలు తీసుకోవడంలో మోదీ దిట్ట’

గోల్కొండ: కేంద్ర ప్రభుత్వం జన గణనతో పాటు కుల గణన కూడా చేయించడం సాహసోపేతమైన నిర్ణయం అని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. కుల గణన, ఓబీసీల భవిష్యత్తు నిర్మాణం తదితర అంశాలపై శనివారం బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం గర్వించదగ్గ నిర్ణయాలు తీసుకోవడంలో ప్రధాని నరేంద్రమోదీ దిట్ట అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మోర్చాల నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఐలాండ్ సిద్ధం



గోల్కొండ: సెవన్ టూంబ్స్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ నియంత్రించడానికి నిర్మించిన ట్రాఫిక్ ఐలాండ్ నిర్మాణం పూర్తయ్యింది. టోలిచౌకీ ట్రాఫిక్ పోలీసులు దీనిని తయారు చేశారు. రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని దీనిని నిర్మించారు. త్వరలోనే దీనిని ప్రారంభించే అవకాశం ఉంది.

వ్యక్తి అదృశ్యం


గౌస్ అబ్దుల్ ఫకీర్

గౌలిపురా: వ్యక్తి అదృశ్యమైన ఘటన భవానీ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన గౌస్ అబ్దుల్ ఫకీర్ (56) రెండేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో భార్య ఫకీర్ ఎడమ కాలును కట్టేసి ఉంచేది. కాగా ఈ నెల 2న ఉదయం 7 గంటలకు ఫకీర్ కాలికి కట్టిన తాడు విడిపించుకొని వెళ్లిపోయాడు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన భర్త కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.